# సాక్షి అనకాపల్లి

బుధవారం । 3 । సెప్టెంబర్ । 2025




## ఒడ్డిమెట్టలో గిరి ప్రదక్షిణ

తొలిసారిగా ఒడ్డిమెట్టలో కైలాసగిరి చుట్టూ భక్తులు గిరి ప్రదక్షిణ చేయనున్నారు. ప్రతి ఏటా నిర్వహించాలని నిర్ణయించారు. 8లో



## రోడ్లు, వంతెనలు నిర్మించాలి..

జీఎన్ రోడ్డులో గోతులను పూడ్చి, కూలిన వంతెనలు నిర్మించాలని వైఎస్సార్‌సీపీ నాయకులు నిరసనకు దిగారు. 8లో

## సిందూర విఘ్నేశ్వరుడు



చోడవరం: స్వయం భూ విఘ్నేశ్వరుడిని మంగళవారం సిందూరంతో అలంకరించారు. ఆలయ ప్రధాన అర్చకుడు కొడమంచిలి చలపతిరావు ఆధ్వర్యంలో వేదపండితులు ప్రత్యేక పూజలు చేశారు.

## ఆరోగ్య ఉప కేంద్రంపై ఫ్లెక్సీల తొలగింపు



ఆరోగ్య ఉపకేంద్రంపై ఫ్లెక్సీలను తొలగించిన దృశ్యం

సాక్షి ఎఫెక్ట్..

మునగపాక: తిమ్మరాజుపేటలోని ప్రాథమిక ఆరోగ్య ఉప కేంద్రానికి కూటమి నేతల ఫ్లెక్సీల నుంచి విముక్తి లభించింది. విద్య, వైద్య రంగాలకు సంబంధించిన స్థలాల్లో రాజకీయ ఫ్లెక్సీలు ఉండరాదన్న నిబంధన ఉన్నప్పటికీ కూటమి నేతలు తమకు పట్టనట్లు వ్యవహ




రించడం విమర్శలకు దారి తీసింది. ఆరోగ్య ఉప కేంద్రం భవనంపై ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ ఫ్లెక్సీలు ఏర్పాటు చేయడంతో సాక్షి దినపత్రిక మంగళవారం నాటి సంచికలో 'ఆరోగ్య కేంద్రమా..? కూటమి కార్యాలయమా' శీర్షికన కథనం వెలువడింది. దీంతో అధికారులు స్పందించారు. ఆరోగ్య ఉపకేంద్రంపై ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను తొలగించారు.

## యూరియా కోసం తప్పని తిప్పలు



మునగపాక పీఏసీఎస్ కార్యాలయం వద్ద యూరియా కోసం వేచి ఉన్న రైతులు

మునగపాక: యూరియా కొరత రైతులను వేధిస్తూనే ఉంది. డిమాండ్‌కు తగ్గ సరకు సకాలంలో రాకపోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. వరి నాట్లు జోరందుకుంటున్న తరుణంలో యూరియా లేక కార్యాలయాల చుట్టూ రైతులు తిరగాల్సి వస్తోంది. సోమవారం మునగపాక పీఏసీఎస్‌కు 12 టన్నుల మేర యూరియాను అధికారులు రప్పించారు. మంగళవారం సొసైటీ ద్వారా యూరియా విక్రయాలు చేపట్టారు. యూరియా విక్రయిస్తున్నట్లు తెలుసుకున్న రైతులు ఉదయం నుంచి సొసైటీ వద్ద వేచి ఉన్నారు. ప్రతి రైతుకు బస్తా వంతున యూరియాను అందజేసినట్లు మండల వ్యవసాయాధికారి సీహెచ్.జ్యోత్స్నకుమారి తెలిపారు.



అనకాపల్లి: పూడిమడక జాతీయ రహదారిలో దివంగత రాజశేఖరరెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు గుడివాడ అమర్‌నాథ్, మాజీ ఎంపీ బీవీ సత్యవతి, పార్టీ అనకాపల్లి పార్లమెంట్ పరిశీలకురాలు శోభా హైమావతి, నియోజకవర్గ సమన్వయకర్త మలసాల భరత్‌కుమార్



దేవరాపల్లి: మామిడిపల్లిలో వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న మాజీ డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు



చోడవరం: కొత్తూరు జంక్షన్ వద్ద వైఎస్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్

# పేదల గుండెల్లో చెరగని ముద్ర

దివంగత సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి 16వ వర్ధంతి సందర్భంగా జిల్లా వ్యాప్తంగా ఘన నివాళులర్పించారు. వైఎస్సార్ విగ్రహాలకు పూలమాలలు వేసి ఊరూ వాడా సేవా కార్యక్రమాలు నిర్వహించారు. పలు వృద్ధాశ్రమాలు, అనాథాశ్రమాల్లో అన్నసమారాధన చేశారు. నిరుపేదలకు వస్త్రాలు, దుప్పట్లు, పండ్లు అందించారు. రక్తదానం చేశారు. ఈ కార్యక్రమాల్లో వైఎస్సార్ సీపీ శ్రేణులతోపాటు రాజన్న అభిమానులు, వివిధ వర్గాల ప్రజలు పాల్గొన్నారు.

## కారణజన్ముడు వైఎస్సార్

- అన్ని వర్గాలకు మేలు చేసిన మహానేత
- వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు అమర్‌నాథ్
- సేవా కార్యక్రమాలతో జిల్లా అంతటా వైఎస్సార్‌కు ఘన నివాళి

అనకాపల్లి: ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో బడుగు, బలహీన వర్గాల ప్రజల గుండెల్లో చెరగని ముద్ర వేసుకుని, అనేక సంక్షేమ పథకాలు అందించిన దివంగత ముఖ్యమంత్రి వై.ఎస్.రాజశేఖరరెడ్డి కారణజన్ముడని, ఆయన ఆశయ సాధనకు నేటి యువత కృషి చేయాలని మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు గుడివాడ అమర్‌నాథ్ అన్నారు. స్థానిక రింగ్ రోడ్డు వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త మలసాల భరత్‌కుమార్ ఆధ్వర్యంలో వైఎస్సార్ 16వ వర్ధంతిని పురస్కరించుకుని ఆయన విగ్రహానికి మంగళవారం పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పూడిమడక జాతీయ రహదారి జంక్షన్, పెరుగు బజార్ జంక్షన్ వద్ద రాజశేఖరరెడ్డి విగ్రహాలకు మాజీ ఎంపీ బి.వి.సత్యవతి, పార్టీ పార్లమెంట్ పరిశీలకురాలు శోభా హైమావతి, నియోజకవర్గ సమన్వయకర్త మలసాల భరత్‌కుమార్‌లు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా అమర్‌నాథ్ మాట్లాడుతూ విద్యార్థులకు ఫీజుల రీయింబర్స్‌మెంట్, 104, 108 వాహనాలు, ఆరోగ్యశ్రీ పథకంతో ప్రజలకు అనేక సేవలు అందించారని కొనియాడారు. సీఎం చంద్రబాబు 30 సంవత్సరాల రాజకీయ చరిత్రలో 16 సంవత్సరాలు సీఎంగా పనిచేసినా పేదల సంక్షేమంలో కోతలు విధించడమే గానీ మేలు చేసిన దాఖలా లేదన్నారు. తండ్రి ఆశయ సాధనకు మాజీ ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి కృషి చేశారని, అనేక సంక్షేమ పథకాలను అమలు చేసి తండ్రిని మించిన తనయుడిగా గుర్తింపు తెచ్చుకున్నారని చెప్పారు. మాజీ ఎంపీ డాక్టర్ బి.వి.సత్యవతి మాట్లాడుతూ వైఎస్సార్ మరణవార్త విని 600 మందికి పైగా మృతి చెందారంటే ప్రజల గుండెల్లో ఆయన ఎంతగా గూడు కట్టుకున్నారో అర్థమవుతుందన్నారు. వైఎస్సార్‌సీపీ పాలనలో మెడికల్ కళాశాలలను ఏర్పాటు చేస్తే.. కూటమి ప్రభుత్వం వాటిని ప్రైవేట్ వ్యక్తులకు అప్పగిస్తోందన్నారు. పార్టీ పార్లమెంట్ పరిశీలకురాలు శోభా హైమావతి మాట్లాడుతూ వైఎస్సార్ మంచితనానికి మారుపేరుగా నిలిచారన్నారు. నియోజకవర్గ సమన్వయకర్త మలసాల భరత్‌కుమార్ మాట్లాడారు. పార్టీ రాష్ట్ర కార్యదర్శి దంతులూరి దిలీప్‌కుమార్, ఎంపీపీ గొర్లి సూరిబాబు, పార్టీ మండల అధ్యక్షులు పెదిశెట్టి గోవింద్, మలసాల కిషోర్ పాల్గొన్నారు.



నర్సీపట్నం : మున్సిపల్ స్టేడియంలో రాజశేఖరరెడ్డి విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న పార్టీ నాయకుడు సిహెచ్. సన్యాసిపాత్రుడు, పార్టీ నాయకులు



నక్కపల్లిలో వైఎస్సార్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న సమన్వయకర్త జోగులు, కాపు కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ వీసం



మునగపాకలో రాజన్న విగ్రహానికి నివాళులర్పిస్తున్న నియోజకవర్గ సమన్వయకర్త ధర్మశ్రీ, పార్టీ రాష్ట్ర కార్యదర్శి ప్రసాద్

సాక్షి, అనకాపల్లి:

దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వై.ఎస్.రాజశేఖరరెడ్డి పేదల గుండెల్లో దేవుడిగా నిలిచిపోయారని మాజీ డిప్యూటీ సీఎం, వైఎస్సార్‌సీపీ పొలిటిక్ అడ్వైజరీ కమిటీ సభ్యుడు బూడి ముత్యాలనాయుడు అన్నారు. దేవరాపల్లి మండలంలోని మామిడిపల్లిలో మంగళవారం నిర్వహించిన వైఎస్సార్ వర్ధంతి కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. మహానేత వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. మహానేత సంక్షేమానికి కొత్త అర్థం చెప్పారని, అందుకే మరణించి 16 ఏళ్లు గడిచినా ప్రజల హృదయాల్లో పదిలంగా ఉన్నారని స్మరించుకున్నారు. ఎంపీపీ చింతల బుల్లిలక్ష్మి, జెడ్పీటీసీ కర్రి సత్యం, వైస్ ఎంపీపీలు పంచాడ సింహాచలంనాయుడు, ఉగ్రాకుల గంగాభవాని, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు బూరె బాబూరావు పాల్గొన్నారు.

- చోడవరంలో జిల్లా పార్టీ అధ్యక్షుడు, సమన్వయకర్త గుడివాడ అమర్‌నాథ్ ఆధ్వర్యంలో వైఎస్సార్ విగ్రహానికి నివాళులర్పించారు. పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు.
- యలమంచిలిలో సమన్వయకర్త కరణం ధర్మశ్రీ ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద గల వైఎస్సార్ విగ్రహానికి నివాళులర్పించారు. మునగపాక మండల కేంద్రంలో వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేశారు. కొండకర్ల ఆవ సమీపంలో ఇచ్ఛా ఫౌండేషన్‌లో పండ్లు, ఫలహారం పంపిణీ చేశారు. వాడ్రాపల్లిలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి బొడ్డేడ ప్రసాద్ చేతుల మీదుగా పేదలకు బియ్యం పంపిణీ చేశారు.
- నర్సీపట్నం మున్సిపల్ స్టేడియంలో పార్టీ టౌన్ అధ్యక్షుడు ఏకా శివ ఆధ్వర్యంలో నిర్వహించిన వర్ధంతి కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు చింతకాయల సన్యాసిపాత్రుడు, రాష్ట్ర యువజన విభాగం ప్రధాన కార్యదర్శి చింతకాయల వరుణ్ పాల్గొని పూలమాలలతో నివాళులర్పించారు. అదేవిధంగా నర్సీపట్నం రూరల్, నాతవరం, గొలుగొండ, మాకవరపాలెం మండల పరిధిలో గల అన్ని గ్రామాల్లో ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, మండల కేంద్రాల్లో ఎంపీపీలు, మండల అధ్యక్షులు, జెడ్పీటీసీల ఆధ్వర్యంలో ఘన నివాళులర్పించారు.
- పాయకరావుపేట నియోజకవర్గంలో సమన్వయకర్త కంబాల జోగులు నక్కపల్లి, ఎస్.రాయవరం, పాయకరావుపేట మండల కేంద్రాల్లో నిర్వహించిన కార్యక్రమాల్లో పాల్గొన్నారు. వైఎస్సార్ విగ్రహానికి నివాళులర్పించారు. నక్కపల్లి మండలంలో కాపు కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ వీసం రామకృష్ణ ఆధ్వర్యంలో అన్నసమారాధన జరిపారు.
- పెందుర్తి నియోజకవర్గంలో సమన్వయకర్త అన్నంరెడ్డి అదీప్‌రాజు ఆధ్వర్యంలో పరవాడ, సబ్బవరంలలోని వైఎస్సార్ విగ్రహాలకు నివాళులర్పించారు. పెందుర్తిలో గల 96వ వార్డులో వైఎస్సార్ విగ్రహానికి పార్టీ సీనియర్‌నేత శరగడం చినఅప్పలనాయుడు నివాళులర్పించారు.


- తొలగించిన ఉద్యోగులను వెంటనే విధుల్లోకి తీసుకోండి
- రాష్ట్ర ప్రభుత్వానికి సుప్రీంకోర్టు ఆదేశం

'అంగన్‌వాడీ'లకు పదేళ్లకు దక్కిన న్యాయం

8లో

సేవలో తరించి.. సేవతోనే ముగించి..

గుండెపోటుతో కుప్పకూలి వడ్డాది వాసి మృతి


# ఆటోవాలా ఆకలి కేకలు

- 'మహిళలకు ఉచిత బస్సు' పథకంతో కుదేలు
- బేరాలు పడిపోవడంతో కష్టమైన కుటుంబ పోషణ
- ఫైనాన్సియర్లకు వడ్డీ కూడా కట్టలేని దుస్థితి



కోటవురట్లలో రోడ్డుపై బైఠాయించిన ఆటోవాలాలు



ఆర్టీసీ బస్సు వద్ద బిచ్చమెత్తుకుంటున్న ఆటోవాలాలు

కోటవురట్ల:

'కూటమి' దెబ్బకు ఆటోవాలాలు రోడ్డెక్కారు.. మేం ఎలా బతకాలంటూ ప్రభుత్వాన్ని నిలదీశారు. గత ప్రభుత్వం ఇచ్చిన సంక్షేమాన్ని తీసేశారు.. దానికి తోడు మహిళలకు ఉచిత బస్సు అంటూ తమ ఉపాధి దెబ్బతీసి రోడ్డున పడేశారంటూ ఆవేదన చెందుతున్నారు. పురుషులు ఎక్కువగా ద్విచక్ర వాహనాలలో రాకపోకలు సాగిస్తుంటారు. సాధారణంగా మహిళలే ఎక్కువగా ఆటోల్లో ప్రయాణిస్తారు. వారికి ఆర్టీసీ బస్సు ప్రయాణం ఉచితం చేయడంతో ఆటోలకు బేరాలు పూర్తిగా తగ్గిపోయాయి. ఆటో డ్రైవర్లు పగలనక రేయనక బండి తోలి వచ్చిన డబ్బులతో కుటుంబాన్ని పోషించుకుంటూ ఉంటారు. ఎంతో కొంత అప్పు చేసి, ఫైనాన్స్ మీద ఆటోలు కొనుగోలు చేస్తారు. ఉన్నపళంగా బేరాలు పడిపోవడంతో ఫైనాన్స్ కూడా కట్టలేని పరిస్థితిలో పడిపోయారు. కుటుంబ పోషణ కష్టమై తీవ్ర ఆందోళన చెందుతున్నారు. జిల్లాలో సుమారు 3,500మంది వరకు ఆటో డ్రైవర్లు ఉన్నారు. తమ సాధక బాధకాలు ఆలోచించకుండా.. ఆర్టీసీకి గుదిబండగా మారే పథకాన్ని చేపట్టడం ప్రభుత్వానికి తగదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తమకు ఉపాధి కల్పించకపోతే కుటుంబసభ్యులతోపాటు బిచ్చమెత్తుకుని జీవించక తప్పదని ఆవేదన చెందుతున్నారు.

### గత ప్రభుత్వం అండ

గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఆటోవాలాల సంక్షేమం కోసం వాహనమిత్ర పథకాన్ని ప్రవేశపెట్టి ఏడాదికి రూ.10 వేలు ఆర్థిక సాయం అందించి ఆదుకున్నారు. ఆ సొమ్ముతో కుటుంబ బాధ్యతలు తీర్చుకోవడంతోపాటు వాహన మరమ్మతులు, ఇన్సూరెన్సు చేయించుకునేవారు. తమ సంపాదనతో పిల్లలను ఉన్నతంగా చదివించుకుంటూ జీవనం గడిపేవారు. ఇపుడు పరిస్థితి పూర్తి భిన్నంగా మారడంతో ఆటోవాలాలు తీవ్ర ఆందోళన చెందుతున్నారు.

### ఆందోళనల బాట

కూటమి ప్రభుత్వ తీరుతో ఆటోవాలాలు ఆందోళన బాట పట్టారు. పలు విధాలుగా తమ ఆవేదనను వ్యక్తపరుస్తూ నిరసనలు తెలుపుతున్నారు. కోటవురట్లలోని శ్రీమరిడిమాంబ ఆటో యూనియన్, చినలింగాపురంలో శ్రీ వెంకటసాయి దుర్గా ఆటో యూనియన్ సభ్యులైన 180మంది ఆటో డ్రైవర్లు మంగళవారం ఆందోళనలు నిర్వహించారు. రోడ్డుపై బైఠాయించి భిక్షాటన చేశారు. ప్రధాన కూడలిలో బైఠాయించి ఆందోళన చేశారు. ఆర్టీసీ బస్సులను కొంత సేపు అడ్డగించి నిరసన తెలిపారు.

బస్సుల్లోకి ఎక్కి మహిళలను బిచ్చమడిగారు. రోడ్డుపై బైఠాయించి కూటమి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. సీఎం డౌన్ డౌన్ అంటూ నినాదాలు చేశారు.

### మా ఉపాధి లాక్కున్నారు..



మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం వల్ల ఆటో డ్రైవర్లు పూర్తిగా నష్టపోతున్నారు. మేమంతా నిరుపేదలమే. ప్రతీ రోజూ ఆదాయం లేకపోతే బతకలేని పరిస్థితి ఉంది. పిల్లల చదువులు కూడా మధ్యలో ఆగిపోయే పరిస్థితులు ఉన్నాయి. ప్రభుత్వం ఆటో డ్రైవర్లను ఆదుకోవాలి.

– చక్కా చిరంజీవి, ఆటో యూనియన్ ప్రెసిడెంట్, కోటవురట్ల

### కుటుంబాలను ఎలా పోషించాలి..



ఉన్నపళంగా ఆటోల బేరాలు పడిపోయాయి. ఇంటికి వెళ్లాలంటే భయమేస్తోంది. మహిళలకు ఆర్టీసీ బస్సు ఉచితం పథకం వచ్చినప్పటి నుంచి ఆదాయం పూర్తిగా పడిపోయింది. ఎలా బతకాలో అర్థం కాని పరిస్థితి ఏర్పడింది. సంక్షేమాన్ని అందించకపోగా ఉన్న ఉపాధిని పోగొట్టారు.

– బందా రాజు, ఆటో యూనియన్ వైస్ ప్రెసిడెంట్, కోటవురట్ల

### ఫైనాన్స్ ఎలా కట్టాలి..



మహిళలు ఆటోలు ఎక్కకపోవడంతో ఆదాయం పూర్తిగా పడిపోయింది. రోజుకు రూ.200 కూడా రావడం లేదు. డీజిల్ డబ్బులు కూడా కిట్టుబాటు కావడం లేదు. మాలో అందరూ ఆటోలను ఫైనాన్స్‌పై కొన్నవారే. ప్రస్తుతం ఫైనాన్స్ కట్టలేని పరిస్థితుల్లో ఉన్నాం.

– మునగాడ కొండలరావు, ఆటో డ్రైవర్, కోటవురట్ల

# ఏ ఒక్క విద్యార్థీ విద్యకు దూరం కాకూడదు



విద్యా శాఖ పురోగతిపై వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ విజయ కృష్ణన్

- జిల్లాలో శతశాతం ఉత్తీర్ణత లక్ష్యం
- అధికారులకు కలెక్టర్ విజయ కృష్ణన్ ఆదేశం

తుమ్మపాల: ప్రస్తుత విద్యా సంవత్సరంలో అన్ని విద్యా సంస్థల్లో శతశాతం ఉత్తీర్ణత సాధించడమే లక్ష్యంగా అధికారులు పనిచేయాలని కలెక్టర్ విజయ కృష్ణన్ ఆదేశించారు. ఇందుకోసం ప్రత్యేక కార్యాచరణ అమలు చేయాలన్నారు. విద్యా శాఖ పురోగతిపై కలెక్టరేట్‌లో అధికారులతో ఆమె వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. ఏ ఒక్క విద్యార్థీ విద్యకు దూరం కాకూడదన్నారు. విద్యా సంస్థల్లో ప్రతి తరగతికి తల్లిదండ్రులతో వాట్సాప్ గ్రూపు ఏర్పాటు చేయాలని, అందులో విద్యార్థుల గైర్హాజరు వివరాలు, రోజువారీ అసైన్‌మెంటు, హోంవర్కు వివరాలను పంపించాలన్నారు. మూడు రోజులకు మించి విద్యార్థి హాజరు కాకపోతే వెంటనే తల్లిదండ్రులను సంప్రదించాలన్నారు. ముఖ్యంగా ఇంటర్మీడియట్ స్థాయిలో డ్రాపౌట్ ఎక్కువగా ఉంటుందని, గైర్హాజరుకు కారణాలను తెలుసుకోవాలన్నారు. బాల్య వివాహాలు కారణమైతే వెంటనే చర్యలు తీసుకోవాలన్నారు. బాల కార్మికులుగా మారినా, వలసలు కారణమైనా అంటువంటి విద్యార్థులను వసతి గృహాలలో చేర్పించాలన్నారు. ప్రతి పాఠశాలలో శక్తి క్లబ్‌లను ఏర్పాటు చేయాలని, వాటి ద్వారా బాలల హక్కులు, పోక్సో చట్టం, మంచి చెడు స్పర్శల తేడాలు, బాలల హెల్ప్‌లైన్ నంబర్లపై బాలికలకు అవగాహన కల్పించాలన్నారు. విద్యా సంస్థల్లోకి విద్యార్థులకు సెల్‌ఫోన్ అనుమతించకూడదన్నారు. విద్యార్థులు ఆరోగ్య సూచిల వివరాలు అబా కార్డులలో నమోదు చేయాలని, రక్తహీనత, విటమిన్ లోపంతో బాధపడేవారికి అవసరమైన మందులు సక్రమంగా అందించాలన్నారు. వసతి గృహాల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని, వర్షాకాలం నేపథ్యంలో మంచినీరు, ఆహారం కలుషితం కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖాధికారి జి. అప్పారావునాయుడు, వెనుకబడిన, గిరిజన, సాంఘిక సంక్షేమ శాఖల అధికారులు, వివిధ కళాశాలల ప్రిన్సిపాళ్లు పాల్గొన్నారు.

## ఇద్దరు ఉపాధ్యాయులపై క్రమశిక్షణ చర్యలు

- మెమోలు జారీ చేసిన డీఈవో

సాక్షి, అనకాపల్లి: విధుల్లో అలసత్వం వహించిన జిల్లాలో ఇద్దరు ఉపాధ్యాయులపై డీఈవో అప్పారావు నాయుడు క్రమశిక్షణ చర్యలు తీసుకున్నారు. బుచ్చెయ్యపేట మండలం వడ్డాది జెడ్పీ హైస్కూల్‌లో హెచ్‌ఎంగా పనిచేస్తున్న ఎస్ఎస్ ప్రసన్నకళ తరుచూ విధుల పట్ల నిర్లక్ష్యం వహించినట్లుగా అధికారుల విచారణలో తేలింది. అదేవిధంగా రావికమతం ఎంఈవో లింగమూర్తి ఇచ్చిన నివేదిక మేరకు.. స్టడీ లీవ్‌పై వెళ్లి పోస్టింగ్ కోసం వచ్చిన మరో ఉపాధ్యాయిని షేక్ బషీ బీబీ తనకు కేటాయించిన సదరు పోస్టులో చేరలేదు. వీరిద్దరికీ డీఈవో మెమోలు జారీ చేశారు. మూడు రోజుల్లోగా సమాధానం ఇవ్వాలని అందులో ఆదేశించారు. వారిచ్చే సమాధానం మేరకు తదుపరి చర్యలుంటాయని డీఈవో మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.

## క్లుప్తంగా

### ఇద్దరు వైద్యులకు పదోన్నతి

మహారాణిపేట: కేజీహెచ్‌లో ఇద్దరు ప్రొఫెసర్లకు అడిషనల్ డీఎంఈలుగా పదోన్నతి లభించింది. ఆంధ్రా మెడికల్ కాలేజీకి చెందిన జనరల్ సర్జరీ ప్రొఫెసర్ డాక్టర్ జె.కిశోర్‌ను పలాస కిడ్నీ రీసెర్చ్ సెంటర్ సూపరింటెండెంట్‌గా నియమించారు. ఆంధ్రా మెడికల్ కాలేజీకి చెందిన గైనిక్ విభాగం ప్రొఫెసర్ జి.సామినిని మచిలీపట్నం ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి సూపరింటెండెంట్‌గా నియమించారు. ఈ మేరకు వైద్య ఆరోగ్యశాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ ఎం.టి.కృష్ణబాబు ఉత్తర్వులు జారీ చేశారు.

### హోంగార్డు ఉద్యోగాలకు దరఖాస్తుల ఆహ్వానం

అల్లిపురం: పోలీసు బ్యాండ్ పార్టీలో హోంగార్డుల నియామకానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు నగర పోలీసు కమిషనర్ శంఖబ్రత బాగ్చి ఓ ప్రకటనలో పేర్కొన్నారు. మ్యూజిక్‌లో డిగ్రీ, డిప్లమా కలిగిన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామన్నారు. మూడు పోస్టులకు బీ కేటగిరి (టెక్నికల్ అండ్ అదర్ ట్రేడ్స్) ఆడ, మగ అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఈ పోస్టులకు దరఖాస్తు చేసుకునే వారు విశాఖపట్నం నగర పరిధిలో నివసించే వారు, 21 నుంచి 50 ఏళ్లు కలిగి.. ఆరోగ్యవంతులైన వారు అర్హులు. డిగ్రీ అర్హత కలిగి, మ్యూజిక్‌లో 55శాతం మార్కులు సాధించిన వారు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు దరఖాస్తులు బుధవారం నుంచి సెప్టెంబర్ 30లోగా సూర్యాబాగ్, పోలీస్ కమిషనర్ కార్యాలయంలో ఇన్‌వార్డ్ సెక్షన్‌లో అందజేయాలని కోరారు.

### అదరగొట్టిన దబాంగ్ ఢిల్లీ

- దుమ్మురేపిన పాంథర్స్

విశాఖ స్పోర్ట్స్ : ప్రో కబడ్డీ పన్నెండో సీజన్‌లో తమ తొలి మ్యాచ్‌లో దబాంగ్ ఢిల్లీ అదరగొట్టింది. పోర్ట్ ఇండోర్ స్టేడియంలో మంగళవారం జరిగిన ఉత్కంఠభరిత పోరులో దబాంగ్ ఢిల్లీ 41–34 పాయింట్ల తేడాతో బెంగళూరు బుల్స్‌పై విజయం సాధించింది. ఢిల్లీ కెప్టెన్ ఆశు మాలిక్ 15 పాయింట్లతో అద్భుతంగా రాణించి జట్టు విజయంలో కీలక పాత్ర పోషించాడు. రైడర్ నీరజ్ 7 పాయింట్లతో అతనికి సహకరించాడు. మరో మ్యాచ్‌లో జైపూర్ పింక్ పాంథర్స్ జట్టు తొలి మ్యాచ్‌లో పాట్నా పైరేట్స్‌పై 39-36 తేడాతో విజయం సాధించింది. జైపూర్ తరఫున నవీన్ 13 పాయింట్లు సాధించి జట్టు విజయంలో కీలక పాత్ర పోషించారు. పాట్నా పైరేట్స్ తరఫున మనీందర్ 15 పాయింట్లతో రాణించినా, వారి జట్టు వరుసగా రెండో మ్యాచ్‌లో ఓడిపోయింది.

### 6న డీఆర్సీ సమావేశం

మహారాణిపేట: జిల్లా సమీక్షా కమిటీ సమావేశం (డీఆర్సీ) ఈ నెల 6వ తేదీ ఉదయం 10 గంటలకు జిల్లా ఇన్‌చార్జి మంత్రి డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామి అధ్యక్షతన కలెక్టరేట్‌లో జరుగుతుందని కలెక్టర్ ఎం.ఎన్.హరేందిర ప్రసాద్ తెలిపారు. ఎంపీ, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఇతర ప్రజాప్రతినిధులు హాజరవుతారన్నారు. జిల్లా అధికారులు పూర్తి సమాచారంతో సమావేశానికి హాజరుకావాలని ఆదేశించారు.

# ఒడ్డిమెట్టలో నేడు గిరి ప్రదక్షిణ



స్వయంభూ విఘ్నేశ్వరుడు



ఒడ్డిమెట్ట కైలాసగిరిపై ఉన్న స్వయంభూ లక్ష్మీగణపతి ఆలయం

- తొలిసారిగా శ్రీకారం చుడుతున్న భక్తులు
- ఏటా నిర్వహణకు సన్నాహాలు

నక్కపల్లి: జిల్లాలో పేరొందిన నక్కపల్లి మండలం ఒడ్డిమెట్టలో కైలాసగిరిపై కొలువుదీరిన స్వయంభూ లక్ష్మీగణపతి గిరి ప్రదక్షిణ బుధవారం జరగనుంది. గ్రామస్తులతో పాటు చుట్టు పక్కల గ్రామాలకు చెందిన ముఖ్యనాయకులు, భక్తులు తొలిసారిగా స్వామివారి కొండ చుట్టూ ప్రదక్షిణ కార్యక్రమానికి శ్రీకారం చుడుతున్నారు. ఇక నుంచి ప్రతి ఏటా స్వామివారి కైలాసగిరి ప్రదక్షిణ కార్యక్రమం నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. దాదాపు వంద సంవత్సరాల క్రితం జాతీయ రహదారిని ఆనుకుని ఉన్న ఒడ్డిమెట్ట కొండపై స్వామివారు మర్రి చెట్టు తొర్రలో స్వయంభూగా వెలిశానని నామవరానికి చెందిన భక్తుడి కలలో కనిపించి చెప్పడంతో నామవరం, గుంటపల్లి ఒడ్డిమెట్ట తదితర గ్రామాలకు చెందిన పూర్వీకులు చెట్టు కింద తవ్వకాలు జరపగా స్వామివారి విగ్రహం బయపడింది. పక్కనే పందిరి వేసి పూజలు చేయడం ప్రారంభించారు. దాతలు ఇచ్చిన విరాళాలతో ఆలయం నిర్మించడంతో భక్తుల సంఖ్య, ఆదాయం పెరిగింది. దీంతో ఈ ఆలయం దేవదాయ శాఖ పరిధిలోకి వెళ్లింది.

**సుమారు 3 కి.మీ మేర పాదయాత్ర**

ఈ ప్రాంత భక్తులు శుభకార్యాలు తలపెట్టినా, వ్యాపారాలు ప్రారంభించినా, నూతన వాహనాలు కొనుగోలు చేసినా ముందుగా ఒడ్డిమెట్ట గణపతి సన్నిధిలో పూజలు చేయడం ఆనవాయితీ. ప్రతి ఏటా వినాయక చవితినాడు లక్షలాది మంది భక్తులు స్వామివారి దర్శనం కోసం జిల్లా నలుమూలల నుంచి తరలివస్తారు. పెద్ద తిరునాళ్లు జరుగుతుంది. ఇంతటి ప్రాచుర్యం పొందిన లక్ష్మీగణపతి స్వయంభూగా వెలసిన కైలాసగిరి ప్రదక్షిణకు భక్తులు శ్రీకారం చుట్టారు. అర్చకులు నిర్ణయించిన ముహూర్తం ప్రకారం బుధవారం ఉదయం 5 గంటలకు జాతీయ రహదారి పక్కన ఉన్న స్వామివారి మండపం వద్ద కొబ్బరి కాయ కొట్టి గిరిప్రదక్షిణ ప్రారంభించనున్నారు. ఈ గిరి ప్రదక్షిణ జాతీయ రహదారి, పాతరోడ్డు, గుంటపల్లి రోడ్డు మీదుగా సుమారు 3 కి.మీ. మేర సాగి తిరిగి జాతీయ రహదారిని చేరుకుని మండపం వద్ద ముగుస్తుంది. ప్రదక్షిణ అనంతరం స్వామివారి మూలవిరాట్ వద్ద ప్రత్యేక పూజలు, దర్శనాలు ఉంటాయని పాలక మండలి చైర్మన్ పైలా నూకన్న నాయుడు తెలిపారు.

# ‘అంగన్‌వాడీ’లకు పదేళ్లకు దక్కిన న్యాయం

- తొలగించిన ఉద్యోగులను వెంటనే విధుల్లోకి తీసుకోండి
- బకాయిలన్నీ చెల్లించి అన్ని సదుపాయాలను కల్పించండి
- రాష్ట్ర ప్రభుత్వానికి సుప్రీంకోర్టు ఆదేశం

విశాఖ–లీగల్: పదేళ్ల క్రితం అన్యాయంగా తొలగించిన అంగన్‌వాడీ ఉద్యోగులను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని సుప్రీంకోర్టు ఆదేశించింది. ఈ మేరకు సుప్రీంకోర్టు ద్విసభ్య ధర్మాసనం తీర్పు వెలువరించింది. విధుల్లో తొలగించిన ఉద్యోగులకు ఐదేళ్ల ఒక నెలకు సంబంధించిన పాత బకాయిలు, జీతభత్యాలతోపాటు మిగతా ఉద్యోగుల మాదిరిగానే సదుపాయాలను కల్పించాలని ఆదేశించింది. జస్టిస్ దీపాంకర్ దత్త, జస్టిస్ అగస్టీన్ జార్జ్ ధర్మాసనం ఈ తీర్పును వెలువరించింది. సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాది పూల వీర్రాజు అందించిన వివరాల మేరకు..2015లో ఉమ్మడి విశాఖ జిల్లాలోని అంగన్‌వాడీ వర్కర్లలో పదో తరగతి పాసైన వారికి సూపర్‌వైజర్ లేదా గ్రేడ్‌–2 హోదా కల్పిస్తూ అప్పటి ప్రభుత్వం నోటిఫికేషన్ జారీ చేసింది. దీంతో జిల్లా కలెక్టర్ చైర్మన్‌గా ఓ కమిటీ ఏర్పాటైంది. ఆ కమిటీ 15 మంది అంగన్‌వాడీ వర్కర్లను సూపర్‌వైజర్లుగా ఎంపిక చేసింది. కొంతకాలం తరువాత రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి ప్రత్యేక నోటిఫికేషన్ ద్వారా వీరిని పక్కన పెట్టారు. దీంతో బాధిత ఉద్యోగులు ఏపీ పరిపాలన ట్రిబ్యునల్‌ను ఆశ్రయించారు. ఉద్యోగులకు అనుకూలంగా ట్రిబ్యునల్ ఆదేశాలిచ్చినా రాష్ట్ర ప్రభుత్వం హైకోర్టును ఆశ్రయించింది. అక్కడ కూడా రాష్ట్ర ప్రభుత్వానికి చుక్కెదురైంది. హైకోర్టు తీర్పును సవాల్ చేస్తూ 2018లో రాష్ట్ర ప్రభుత్వం సుప్రీంకోర్టులో 15 మందిపై స్పెషల్ లీవ్ పిటిషన్లు దాఖలు చేసింది. విశాఖకు చెందిన సీనియర్ న్యాయవాది పూళ్ల వీర్రాజు బాధితుల తరఫున వాదనలు వినిపించారు. వాదనల అనంతరం బాధితులకు అనుకూలంగా సుప్రీంకోర్టు తాజాగా తీర్పు వెలువరించింది. బాధితులు సాక్షితో మాట్లాడుతూ పదేళ్ల తమ సుదీర్ఘ పోరాటం ఫలించిందన్నారు.

# సేవలో తరించి..సేవతోనే ముగించి

- ఆర్టీసీ బస్‌లో ప్రయాణిస్తూ గుండెపోటుతో వ్యక్తి మృతి
- స్వచ్ఛంద సంస్థలో కీలక సభ్యుడిగా వ్యవహరిస్తున్న రాజేష్
- మరణం తరువాత అతని నేత్రాలు దానం చేసిన కుటుంబ సభ్యులు





రాజేష్ నేత్రాలను దానం చేసేందుకు అంగీకారం తెలుపుతున్న తండ్రి వరహాలబాబు (ఇన్‌సెట్) ఆర్టీసీ బస్‌లో గుండెపోటుతో మరణించిన సయ్యపురెడ్డి రాజేష్ (ఫైల్)



రాజేష్ మృతదేహం

పెందుర్తి/బుచ్చెయ్యపేట: మనిషి జీవితం ఎప్పుడు ఎలా ముగుస్తుందో ఎవరూ ఊహించలేరు. కానీ కొంతమంది జీవితం మాత్రం ఇతరుల కోసం అంకితమై ఉంటుంది. అనకాపల్లి జిల్లా బుచ్చెయ్యపేట మండలం వడ్డాది గ్రామానికి చెందిన సయ్యపురెడ్డి రాజేష్ (రాజా) (42) అలాంటి కోవకు చెందిన వారు. అగ్రి కల్చర్ మార్కెటింగ్ కమిటీలో ఉద్యోగం చేస్తూనే..‘అమ్మ హెల్పింగ్ హార్ట్స్’ స్వచ్ఛంద సేవా సంస్థలో క్రియాశీలక సభ్యుడిగా వేలాది మంది జీవితాల్లో వెలుగులు నింపారు. అతని జీవిత ‘ప్రయాణం’ సేవతో మొదలై, సేవతోనే ముగిసింది.

మంగళవారం మధ్యాహ్నం, చోడవరం నుంచి విశాఖ నగరానికి ఆర్టీసీ బస్సులో బయలుదేరిన రాజేష్‌ను విధి వెంబడించింది. పెందుర్తి మండలం రాంపురం వద్దకు రాగానే ఆయన తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. తోటి ప్రయాణికులు వెంటనే స్పందించి బస్సు ఆపారు. బస్సు కండక్టర్ మురళీకృష్ణ వెంటనే రాజేష్‌కు సీపీఆర్ చేయగా, డ్రైవర్ వాసు సమయస్ఫూర్తితో బస్సును పెందుర్తిలోని ప్రభుత్వ ఆస్పత్రి (సీహెచ్‌సీ)కి వేగంగా తరలించారు. కానీ వైద్యులు ఎంత ప్రయత్నించినా ప్రయోజనం లేకుండా పోయింది. అప్పటికే రాజేష్ గుండెపోటుతో మృతి చెందాడు.

**మరణంలోనూ మానవత్వం.. నలుగురికి వెలుగులు**

రాజేష్ మరణ వార్త తెలుసుకున్న కుటుంబ సభ్యులు, స్నేహితులు, బంధువులు.. ‘అమ్మ హెలింగ్ హార్ట్స్’ ట్రస్ట్ ప్రతినిధులు, స్థానిక ప్రజలు పెందుర్తి ఆస్పత్రికి విషాదంతో తరలివచ్చారు. ఆయన చేసిన సేవా కార్యక్రమాలను గుర్తు చేసుకుని కంటతడిపెట్టారు. ఈ విషయాన్ని తెలుసుకున్న పెందుర్తిలోని ‘సాయి హెల్పింగ్ హ్యాండ్స్ చారిటబుల్ ట్రస్ట్’ వ్యవస్థాపకుడు దాడి శ్రీనివాస్ అక్కడికి చేరుకున్నారు. రాజేష్ నేత్రాలను దానం చేయమని ఆయన కుటుంబ సభ్యులను కోరారు. వారి కోరికను అర్థం చేసుకున్న రాజేష్ తల్లిదండ్రులు వరహాల బాబు, స్వర్ణకుమారి గొప్ప మనసుతో అంగీకరించారు. ‘మా కుమారుడు జీవించి ఉన్నప్పుడు ఎన్నో సేవా కార్యక్రమాలు చేశాడు. ఇప్పుడు లేడు. అతని నేత్రాలు నలుగురికి ఉపయోగపడతాయంటే మాకు ఏ అభ్యంతరం లేదు’ అని వారు కన్నీళ్లతో తెలిపారు. వారి అంగీకారంతో, ‘మోషిన్ ఐ బ్యాంక్’ ప్రతినిధి అజయ్ బృందం రాజేష్ నేత్రాలను (కార్నియా) సేకరించారు. నిస్వార్థంగా సేవ చేస్తూ తన జీవితాన్ని అంకితం చేసిన రాజేష్, మరణానంతరం కూడా నలుగురి జీవితాల్లో వెలుగులు నింపి చరిత్రలో నిలిచిపోయాడు.

# రోడ్లు, వంతెనలు నిర్మించాలి..



కొట్టుకుపోయిన పేట డైవర్షన్ రోడ్డు వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

బుచ్చెయ్యపేట : భీమునిపట్నం,నర్సీపట్నం(బీఎస్) రోడ్డులో గోతులను పూడ్చి, కూలిన వంతెనలు,దెబ్బతిన్న డైవర్షన్ రోడ్లు నిర్మించి ప్రయాణికులకు రవాణా సదుపాయం కల్పించాలని మండల వైఎస్సార్‌సీపీ నాయకులు నిరసనకు దిగారు. మంగళవారం బీఎస్ రోడ్డులో ఏర్పడ్డ పెద్ద పెద్ద గోతులు విజయరామరాజుపేట, వడ్డాదిలో కూలిన వంతెనలు, కొట్టుకుపోయిన డైవర్షన్ రోడ్ల వద్ద వైఎస్సార్‌సీపీ నాయకులు నిరసన చేపట్టారు. వడ్డాది పెద్దేరు వంతెనపైన, విజయరామరాజుపేట తాచేరు వంతెనపైన ఉన్న డైవర్షన్ రోడ్లు కొట్టుకుపోయి నెల రోజులవుతున్నా నాయకులు, అధికారులు పట్టించుకోకపోవడం వల్ల అనకాపల్లి, విశాఖ, పాడేరు మూడు జిల్లాల ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని జెడ్పీటీసీ దొండా రాంబాబు, మండల వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కె.అచ్చింనాయుడు తెలిపారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో వర్షాలకు కొట్టుకుపోయిన డైవర్షన్ రోడ్లను నీటి ఉధృతి తగ్గిన వెంటనే యుద్ధ ప్రతిపాదికన వేగవంతంగా పనులు చేపట్టి ప్రయాణికులకు రాకపోకలు సాగేలా చేశామన్నారు. నేడు బీఎస్ రోడ్డులో రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నా కూటమి ప్రభుత్వ ఎమ్మెల్యే, ఎంపీలు పట్టించుకోకపోవడం సిగ్గు చేటన్నారు. తక్షణం బీఎస్ రోడ్డులో కూలిన వంతెనల నిర్మాణం చేపట్టి కొట్టుకుపోయిన డైవర్షన్ రోడ్లను,గోతులను పూడ్చి ప్రజలకు రవాణా సదుపాయం కల్పించాలని డిమాండ్ చేశారు. వైస్ ఎంపీపీ దొండా లలితా నారాయణమూర్తి, డీసీసీబీ మాజీ డైరెక్టర్ కోవెల జనార్దనరావు, ఎంపీటీసీ కోరుకొండ లీలావతి రమణ, సర్పంచ్ ఎల్లపు విజయ్‌కుమార్ నాయకులు గుమ్మిడి ప్రసాద్,నమ్మి అప్పలరాజు, జోగా కొండబాబు, గుద్దేటి శ్రీను,గుడాల ఆనంద్, సయ్యపురెడ్డి కొండబాబు, అమ్మునాయుడు, అప్పారావు పాల్గొన్నారు.

# తల్లిదండ్రులకు పిల్లల అప్పగింత

అచ్యుతాపురం రూరల్ : అలిగి వెళ్లిపోయిన పిల్లలను తిరిగి తమ తల్లిదండ్రులకు అప్పగించామని అచ్యుతాపురం సీఐ నమ్మి గణేష్ తెలిపారు. కొండకర్ల గ్రామానికి చెందిన బందపు సందీప్ కుమార్(14), ఇందల తేజ(14) ఇంట్లో తల్లిదండ్రులు మందలించారనే కోపంతో అలిగి బయటకు వెళ్లిపోయారు.

బొద్దపు కల్పన స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తులో భాగంగా అనకాపల్లి జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా, పరవాడ ఎస్డీపీవో విష్ణు స్వరూప్ ఆదేశాల మేరకు ప్రత్యేక టీమ్‌ను నియమించారు. ఈ క్రమంలో గూడూరు రైలులో ప్రయాణిస్తున్న పిల్లలను ఫిర్యాదు అందిన 10 గంటలలోపు గుర్తించి పోలీసులు తీసుకొచ్చారు. వారిని తల్లిదండ్రులకు అప్పగించారు.



పిల్లలను తల్లిదండ్రులకు అప్పగిస్తున్న అచ్యుతాపురం పోలీసులు

# గంజాయి తరలిస్తున్న ఇద్దరి అరెస్ట్



నిందితులతో ఎస్ఐ ఉమామహేశ్వరరావు, సిబ్బంది

నర్సీపట్నం: గంజాయి తరలిస్తున్న ఇద్దర్ని టౌన్ పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. టౌన్ సీఐ జి.గోవిందరావు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ముందుస్తుగా అందిన సమాచారం మేరకు ఎస్ఐ ఉమామహేశ్వరరావు, సిబ్బందితో కలిసి మంగళవారం ఆర్టీసీ కాంప్లెక్స్ ఔట్ గేటు వద్ద వాహనాల తనిఖీలు చేపట్టారు. బైక్‌పై వస్తున్న హైదరాబాద్‌కు చెందిన యలమంచలి వివేక్, కాకినాడకు చెందిన ఉయ్యాల సాయిచరణ్‌ను అదుపులోకి తీసుకుని, వారి వద్ద నుంచి ఆరున్నర కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. వీరికి పైలెట్‌గా వ్యవహరించిన అల్లూరి జిల్లా హుకుంపేటకు చెందిన బాలుడిని అదుపులోకి తీసుకుని, జువైనల్ హోంకు తరలించామని సీఐ తెలిపారు. రెండు వాహనాలు, రెండు సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు.

# కుక్క దాడిలో మహిళకు తీవ్ర గాయాలు



కుక్కకాటుకు గురైన కోట్ని శ్రావణ జ్యోతి

అనకాపల్లి: స్థానిక కోట్నివీధి రామాలయం వద్ద మంగళవారం ఓ పిచ్చి కుక్క స్వైర విహారం చేసింది. కోట్ని శ్రావణజ్యోతి తెల్లవారుజామున ఇంటి తలుపు తీస్తున్న సమయంలో పిచ్చికుక్క ఒక్కసారిగా దాడి చేయంతో ఆమెకు తీవ్ర గాయాలయ్యాయి. హుటాహుటిన కుటుంబ సభ్యులు ఆమెను ఎన్టీఆర్ ఆస్పత్రికి తరలించి ప్రథమ చికిత్స అందించారు. మెరుగైన వైద్యం కోసం కేజీహెచ్‌కు తరలించారు. జ్యోతిని కరిచిన పిచ్చికుక్క కొద్ది సేపటి తరువాత ఇంటికి కొద్ది దూరంలో మృతిచెందింది. పట్టణ పరిధిలో పిచ్చికుక్కలు దాడులు ఎక్కువగా చోటు చేసుకుంటున్నాయని, జీవీఎంసీ సిబ్బంది తక్షణం చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

# డిగ్రీ ‘స్పెషల్’ అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన గడువు నేడు

మద్దిలపాలెం: డిగ్రీ అడ్మిషన్ల కోసం స్పెషల్ కేటగిరీలో దరఖాస్తు చేసుకున్న అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన బుధవారంతో ముగియనున్నట్లు డాక్టర్ వీఎస్ కృష్ణా ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఐ.విజయబాబు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. స్పెషల్ కేటగిరీలైన ఎన్‌సీసీ, స్పోర్ట్స్, సీఏపీ(డిఫెన్స్ పర్సనల్), ఫిజికల్లీ చాలెంజ్డ్ వంటి అభ్యర్థులు తమ సర్టిఫికెట్లతో కళాశాలకు హాజరు కావాలన్నారు. వివరాల కోసం అడ్మిషన్ల కోఆర్డినేటర్ డాక్టర్ డి.రమేష్‌ను సంప్రదించాలని సూచించారు.

# వడ్డాది హెచ్‌ఎం తీరుపై తల్లిదండ్రుల ఆగ్రహం



హెచ్‌ఎం ప్రసన్నకళను ప్రశ్నిస్తున్న నాయకులు, తల్లిదండ్రులు

బుచ్చెయ్యపేట: మేజర్ పంచాయితీ వడ్డాది కోవెల అప్పన్నదొర జిల్లా పరిషత్ హైస్కూల్ హెచ్‌ఎం ప్రసన్నకళ తీరుపై తల్లిదండ్రులు, గ్రామ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం స్కూల్ చైర్మన్ మేడివాడ రమణ, గ్రామ నాయకులు దొండా నరేష్, తలారి శంకర్, గురుమూర్తి, సూరిబాబు, తదితరులు హెచ్‌ఎంపై మండిపడ్డారు. మూడు నెలలుగా ఓ బయట యువకుడిని తీసికొచ్చి ఉదయం నుంచి సాయంత్రం వరకు పాఠశాలలో ఉంచడాన్ని తప్పుపట్టారు. ఆ యువకుడు 8, 9, 10వ తరగతి విద్యార్థినుల ఫొటోలు తీయడం, ఫోన్ నంబర్లు తీసుకుని వేధించడంపై హెచ్‌ఎంను నిలదీశారు. విధుల్లో చేరి మూడు నెలలైనా గత హెచ్‌ఎం నుంచి ఎందుకు చార్జ్ తీసుకోలేదని ఆమెను ప్రశ్నించారు. పాఠశాలలో నాడు–నేడు పనులకు సంబంధించిన సుమారు 200 సిమెంట్ బస్తాలు గడ్డకట్టి పాడైనా పనులు ఎందుకు పూర్తి చేయడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. మరుగుదొడ్లు లేక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నా పట్టించుకోవడం లేదన్నారు. పాఠశాల వాతావరణం మార్చకపోతే ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు. ఉపాధ్యాయులు రాజకీయాలను పక్కనపెట్టి విద్యార్థులకు మెరుగైన బోధన అందించేందుకు కృషి చేయాలని సూచించారు.

# జనసేన నాయకుల బరి తెగింపు

కోటకోట: మండలంలోని జి.భీమవరం గ్రామంలో జనసేన నాయకులు బరి తెగించారు. పార్టీ అధినేత, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ జన్మదినోత్సవం సందర్భంగా నర్సీపట్నం రోడ్డులోని విద్యుత్ స్తంభాలకు ఫ్లెక్సీలు కట్టి నిబంధనలకు విరుద్ధంగా వాటికి విద్యుత్ లైట్లను కూడా ఏర్పాటు చేయడం స్థానికులను విస్మయానికి గురి చేసింది. పలు స్తంభాలకు వీటిని అమర్చి విద్యుత్ చౌర్యానికి పాల్పడినప్పటికీ ఆ శాఖ అధికారులు మాత్రం ఏమీ పట్టనట్టు వ్యవహరించడంపై స్థానికులు మండిపడుతున్నారు. తక్షణం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.



జి.భీమవరంలో స్తంభానికి కట్టిన పవన్ కల్యాణ్ ఫ్లెక్సీ



ఫ్లెక్సీలకు ఏర్పాటు చేసిన విద్యుత్ లైటింగ్

## క్లుప్తంగా

### పులికాలువలో అనధికారికంగా గొట్టాలు



పులికాలువ మధ్యలో వేసిన సిమెంట్ గొట్టం

అనకాపల్లి టౌన్: పట్టణంలోని సాత్-2 పరిధిలో పులికాలువలో అనధికారికంగా గొట్టాలు వేసి నీటి ప్రవాహానికి రియల్ ఎస్టేట్ వ్యాపారు లు ఆటంకం కలిగిస్తున్నారని పులికాలువ డైరెక్ట ర్ సూరిశెట్టి ఈశ్వరరావు విమర్శించారు. స్థాని క ఇరిగేషన్ కార్యాలయ అధికారి రూపాదేవికి ఈ మేరకు వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పులికాలువ ఆయకట్టు కింద 600 ఎకరాల్లో వరి, నువ్వులు, కాయగూరలు పండిస్తున్నార న్నారు. ఇటీవలే ఈ కాలువలో పూడికలు తీశారని, ఇంతలోనే రియల్ ఎస్టేట్ వ్యాపారులు గొట్టాలు వేయడం వల్ల నీటి ప్రవాహానికి ఆటంకం ఏర్పడుతుందన్నారు. తక్షణమే పులికాలువలో వేసిన గొట్టా లను తొలగించాలని కోరారు. కార్యక్రమంలో సూరిశెట్టి రమణ అప్పారావు పాల్గొన్నారు.

### ఉచిత డేటా ఎంట్రీ ఆపరేటర్ శిక్షణ

తుమ్మపాల: రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 10 నుంచి ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల (రేబాక) స్కిల్‌హబ్‌లో డొమెస్టిక్ డేటా ఎంట్రీ ఆపరేటర్ ఉచిత శిక్షణ తరగతులు ప్రారంభించనున్నట్లు ప్రిన్సిపాల్ ఐవీఎస్ఎస్ శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. పదో తరగతి నుంచి డిగ్రీ పూర్తి చేసిన అభ్యర్థులు మాత్రమే అర్హులని తెలిపారు. ఆసక్తి గల వారు కళాశాలలో సంప్రదించి దరఖాస్తు చేసుకోవాలని కోరారు. మరింత సమాచారం కోసం 7013342667 సంప్రదించాలన్నారు.

### మూల్యాంకనం నగదు చెల్లించాలని వినతి



డీఈవోకు వినతిపత్రం అందజేస్తున్న ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘాల నాయకులు

అనకాపల్లి టౌన్: ఈ ఏడాది మార్చి, ఏప్రిల్‌లో జరిగిన పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు సంబంధించి మూల్యాంకనం విధులకు హాజరైన ఉపాధ్యాయులకు నేటి వరకు నగదు చెల్లించలేదని ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయుల సంఘం జిల్లా అధ్యక్షుడు ఎం శ్రీనివాసరావు తెలిపారు. ఈ మేరకు జిల్లా విద్యాశాఖాధికారి గిడ్డి అప్పారావు నాయుడుకు వినతిపత్రం అందజేశారు. మూల్యాంకనం చేసి ఆరు నెలలు కావస్తున్నా, బిల్లులు విడుదల చేయకపోవడం బాధాకరమన్నారు. కార్యక్రమంలో సంఘం జనరల్ సెక్రటరీ వై సుధాకర్ పాల్గొన్నారు.

### బెల్లం ధరలు

అనకాపల్లి బెల్లం మార్కెట్‌కు మంగళవారం 30 దిమ్మలు వచ్చాయి.

| దిమ్మల రకం | కనిష్ట ధర | గరిష్ట ధర |
|---|---|---|
| మొదటి రకం | 4,310 | 4,680 |
| రెండో రకం | 3,760 | 3,760 |
| మూడో రకం | 3,580 | 3,580 |

### అనకాపల్లి సినిమాలు

| | |
|---|---|
| రాజా | : త్రిబాణధారి బార్బరిక్ |
| సత్యనారాయణ స్క్రీన్-1 | : కొత్తలోక |
| సత్యనారాయణ స్క్రీన్-2 | : బ్రహ్మాండ |
| పర్తిసాయి | : మహావతార్ నరసింహం (మ్యాట్నీ, సెకండ్ షో) |
| పర్తిసాయి | : అర్జున్ చక్రవర్తి (మార్నింగ్ షో, ఫస్ట్ షో) |
| షిర్డీసాయి | : కూలీ |
| వెంకటేశ్వర | : బన్ బట్టర్ జామ్ |
| శ్రీ సత్య | : హరిహర వీరమల్లు |
| రామచంద్ర | : వార్ 2 |

### రక్త నిల్వలు

అనకాపల్లి: ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 84 యూనిట్ల రక్త నిల్వ ఉంది. ఏ పాజిటివ్-11, బీ పాజిటివ్-24, ఓ పాజిటివ్-43, ఏబీ పాజిటివ్-6 యూనిట్లు శుద్ధి చేసిన రక్త నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్‌బ్యాంక్ టెక్నీషియన్ యాలోకేష్ (9703613706)ను సంప్రదించవచ్చు.

### గ్యాస్ సమాచారం

అనకాపల్లి: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా మంగళవారం 356 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 321 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ప్రతినిధి 08924-223595 నంబరును సంప్రదించవచ్చు.

# సంక్షేమ ప్రదాత వైఎస్సార్

• నియోజకవర్గ సమన్వయకర్త మలసాల భరత్‌కుమార్ • వాడవాడలా మహానేత వైఎస్.రాజశేఖరరెడ్డి 16వ వర్ధంతి



పూడిమడక రోడ్డులో వైఎస్సార్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు



వేల్పులవీధి పార్కు సెంటర్ వద్ద వైఎస్సార్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న జాజుల రమేష్, ఉగ్గిన అప్పారావు



రింగ్‌రోడ్డులో వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో మహానేత వై.ఎస్.రాజశేఖరరెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్, జిల్లా పార్లమెంట్ పరిశీలకురాలు శోభా హైమావతి, నియోజకవర్గ సమన్వయకర్త మలసాల భరత్‌కుమార్



పట్టణంలో పెరుగుబజార్ జంక్షన్ వద్ద వైఎస్సార్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న శోభా హైమావతి, బీవీ సత్యవతి, భరత్‌కుమార్, దిలీప్‌కుమార్



కుంద్రంలో రాజశేఖరరెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న మలసాల భరత్‌కుమార్

అనకాపల్లి: ఊరూవాడా మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డిని మనసారా స్మరించుకుంది. పేదల పెన్నిధి, ఆరోగ్య ప్రదాత, సంక్షేమ రథసారథిగా వేనోళ్ల కీర్తించింది. దివంగత సీఎం వైఎస్సార్ 16వ వర్ధంతి కార్యక్రమాలను పట్టణంతోపాటు మండలంలో మంగళవారం నిర్వహించారు. కూండ్రం గ్రామంలో వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త మలసాల భరత్‌కుమార్ నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్పొరేట్ విద్యా సంస్థల్లో పేద విద్యార్థులు చదువుకునేలా ఫీజు రీయింబర్సుమెంటు అమలు చేసి ఉన్నత స్థాయికి చేర్చారని కొనియాడారు. పేదలకు ఆరోగ్యశ్రీ పథకం అమలు చేసి కార్పొరేట్ వైద్యం అందించారన్నారు. ఇలా ఎన్నో సంక్షమ పథకాలు అమలు చేసి ప్రజల్లో చెరగని ముద్ర వేసుకున్నారన్నారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర యువజన విభాగం కార్యదర్శి మలసాల కుమార్ రాజా, పార్టీ మండల అధ్యక్షుడు పెదిశెట్టి గోవింద్, గ్రామ నాయకులు కలవలపల్లి మధుబాబు, శానాపతి లక్ష్మణరావు, మొల్లి గంగునాయుడు, యలమంచిలి నాయుడు, కొప్పుల అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

**వేల్పులవీధి పార్కు సెంటర్ వద్ద...**

స్థానిక వేల్పులవీధి పార్కు సెంటర్ వద్ద పార్టీ సీనియర్ నాయకుడు ఉగ్గిన అప్పారావు ఆధ్వర్యంలో మహానేత రాజశేఖరరెడ్డి విగ్రహానికి పార్టీ నియోజకవర్గ యువజన విభాగం అధ్యక్షుడు జాజుల రమేష్ పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ రాజశేఖర్‌రెడ్డి ఐదు సంవత్సరాల మూడు నెలల పాలన చిరస్మరణీయమన్నారు. పోలవరం ప్రాజెక్టుకు జాతీయ హోదా వచ్చిందంటే ఈ ఘనత వైఎస్సార్‌దే అన్నారు. ప్రాజెక్టు పూర్తవ్వక పోయినా కుడి, ఎడమ కాలువల ద్వారా ఈరోజు రైతులు పంటలు పండించుకుంటున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు వేల్పుల గణేష్, జెట్టి శ్రీను, కొంకి శ్రీరామ్‌మూర్తి, యింజరపు వెంకటరావు, దొండ వాసు, యర్ర ఈశ్వరరావు, డొంకా సత్తిబాబు పాల్గొన్నారు.

**కొత్తూరు జంక్షన్ వద్ద..**

ఏఎంఏఎల్ కళాశాల కొత్తూరు జంక్షన్ వద్ద మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి కొత్తూరు పంచాయతీ సర్పంచ్ సప్పారపు లక్ష్మీప్రసన్న పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ మరుగుతి సంతోష్‌కుమారి, నాయకులు వరహాలబాబు, శ్రీనివాస్, గ్రామ కమిటీ అధ్యక్షుడు మొల్లి నాగు, పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

**కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో...**

స్థానిక జాతీయ రహదారి పూడిమడక జంక్షన్ వద్ద కాంగ్రెస్ పార్టీ జిల్లా ఓబీసీ చైర్మన్ బొంతు రమణ మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పాలనలో వైఎస్సార్ చేసిన సేవలు ఎనలేనివని అన్నారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి కాళ్ల సత్యనారాయణ, పట్టణ అధ్యక్షుడు సేనాపతి ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

**గవరపాలెం అగ్గి మర్రిచెట్టు వద్ద..**

స్థానిక గవరపాలెం అగ్గి మర్రిచెట్టు వద్ద మహానేత వైఎస్.రాజశేఖరరెడ్డి విగ్రహానికి పార్టీ 80వ వార్డు ఇన్‌చార్జి కె.ఎం.నాయుడు, నూకాంబిక దేవస్థానం మాజీ చైర్మన్ కొణతాల మురళీకృష్ణ, పార్టీ సీనియర్ నాయకుడు బొడ్డేడ శివ పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులకు ఉచిత విద్యుత్, ఆరోగ్యశ్రీ పథకం వంటి అనేక సంక్షేమ పథకాలు అమలు చేశారన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు దాడి నారాయణరావు, కాండ్రేగుల శ్యామ్, సుంకర వెంకటేశ్వరరావు, నడిశెట్టి మధు, గొల్లవిల్లి నర్సింగరావు, రాపేటి మహాలక్ష్మినాయుడు, వాసుపల్లి తాతయ్యలు, పెతకంశెట్టి గోపి తదితరులు పాల్గొన్నారు.

రింగురోడ్డు పార్టీ కార్యాలయంలో జరిగిన కార్యాక్రమంలో 84 వార్డు ఇన్‌చార్జి కె.రాఘవ, పట్టణ యువజన విభాగం అధ్యక్షుడు వేగి త్రినాథ్, పార్టీ సీనియర్ నాయకులు కుండల రామకృష్ణ, కొణతాల మురళీకృష్ణ, దాడి నారాయణరావు, ఉగ్గిన అప్పారావు, కడిమిశెట్టి సతీష్, బొడ్డేడ లక్ష్మినరసింహ, గైపూర్ రాజు, మరిపల్లి శోభ, ఎస్.లక్ష్మి పాల్గొన్నారు.



కశింకోటలోని గౌరమ్మ ఆలయం వద్ద రాజశేఖరరెడ్డి విగ్రహానికి నివాళులు

కశింకోట: స్థానిక గౌరమ్మ ఆలయం సమీపంలో దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి మంగళవారం వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. సర్పంచ్ మంత్రి జయరజని, పార్టీ జిల్లా యువజన ఉపాధ్యక్షుడు, ఆర్ఈసీఎస్ మాజీ డైరెక్టర్ పెంటకోట శ్రీనివాసరావు, తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

కశింకోట: మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి వర్ధంతి కార్యక్రమాన్ని కశింకోటలో నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక పంచాయతీ ప్రధాన రహదారిలో వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ముఖ్యమంత్రిగా వైఎస్సార్ రాష్ట్రానికి అందించిన సేవలను నాయకులు ప్రస్తుతించారు. జెడ్పీటీసీ సభ్యుడు దంతులూరి శ్రీధర్‌రాజు, పార్టీ జిల్లా అధికారి ప్రతినిధి మళ్ల బుల్లిబాబు, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ గొల్లవిల్లి శ్రీనివాసరావు, సర్పంచ్ మంత్రి జయరజని, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు మంత్రి పీటర్ వైజ్ మెన్, రాణి తదితర పార్టీ శ్రేణులు, అభిమానులు పాల్గొన్నారు.



కశింకోటలో రాజశేఖరరెడ్డి విగ్రహానికి వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో నివాళులు



కొత్తూరులో రాజశేఖరరెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న సర్పంచ్ ప్రసన్నలక్ష్మి, పార్టీ నాయకులు



గవరపాలెం అగ్గి మర్రిచెట్టు వద్ద రాజశేఖరరెడ్డి విగ్రహానికి నివాళులర్పించిన 80వ వార్డు ఇన్‌చార్జి కె.ఎం.నాయుడు, సీనియర్ నాయకుడు బొడ్డేడ శివ

## భక్తిభావం కలిగి ఉండాలి



వినాయక సంఘం సభ్యులకు చందా అందజేస్తున్న ముత్యాల రాజేష్

అనకాపల్లి టౌన్: ప్రతి ఒక్కరూ భక్తిభావం కలిగి ఉండి, విరివిగా అన్నదాన, సేవా కార్యక్రమాలు నిర్వహించాలని ముత్యాల గార్మెంట్ అధినేత ముత్యాల రాజేష్ పేర్కొన్నారు. స్థానిక నరసిగరావుపేటలో ఆయన కార్యాలయంలో కశింకోట మండలం తేగాడ గ్రామంలో వరసిద్ధి వినాయక సంఘం నెలకొల్పిన వినాయకుడి వద్ద కమిటీ వారు గురువారం నిర్వహించే అన్నసమారాధనకు ఐదు వేల రూపాయల చందా అందజేశారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



వినాయక విగ్రహం వద్ద లలితా పారాయణంలో పాల్గొన్న భక్తులు

**భక్తిశ్రద్ధలతో లలితా పారాయణం**

అనకాపల్లి టౌన్: పట్టణంలోని న్యూకాలనీలో సిద్ధి వినాయక యూత్ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహం ఆవరణలో ఏర్పాటు చేసిన లలితా పారాయణం భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. ఉదయం స్వామివారికి అభిషేకాలు నిర్వహించి భక్తులకు ప్రసాద వితరణ జరిగింది. సాయంత్రం ఏర్పాటు చేసిన లలితా పారాయణంలో భక్తులు పాల్గొని భక్తిగీతాలను ఆలపించారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.

## దివ్యాంగునికి ట్రైసైకిల్ అందజేత

కశింకోట: మండలంలోని చింతలపాలెంలో దివ్యాంగునికి వైఎస్సార్ సీపీ చేయూతగా నిలిచింది. దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి వర్ధంతి పురస్కరించుకొని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త మలసాల భరత్ కుమార్ ఆదేశాల మేరకు సర్పంచ్ కొట్టె రాము ఆధ్వర్యంలో దివ్యాంగునికి పార్టీ మండలాధ్యక్షుడు మలసాల కిషోర్ ట్రైసైకిల్‌ను అందజేశారు. గ్రామ పార్టీ సీనియర్ నాయకుడు సియాద్రి రాజు, జిల్లా దివ్యాంగుల విభాగం పార్టీ ఉపాధ్యక్షుడు, నియోజకవర్గ మైనార్టీ సెల్ అధ్యక్షుడు షేక్ రెహమాన్, పార్టీ జెట్టపురెడ్డితుని అధ్యక్షుడు కోన నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



దివ్యాంగునికి ట్రైసైకిల్ అందజేస్తున్న పార్టీ మండలాధ్యక్షుడు మలసాల కిషోర్

## తహసీల్దారు పోస్టుకు రాంరాం

రాజకీయ ఒత్తిళ్లతో బాధ్యతల స్వీకరణకు విముఖత



ఖాళీగా ఉన్న అనకాపల్లి తహసీల్దార్ కుర్చీ

అనకాపల్లి: స్థానిక తహసీల్దార్ పోస్టులో చేరేందుకు ఇతర మండలాల తహసీల్దార్లు ససేమిరా అంటున్నారు. ఇక్కడకు బదిలీపై వచ్చి బాధ్యతలు స్వీకరించడానికి విముఖత చూపుతున్నారు. ప్రధానంగా జిల్లా కేంద్రం కావడం, కూటమి నాయకుల ఒత్తిళ్లు ఎక్కువగా ఉండటంతో ఇక్కడ విధుల నిర్వహణ కత్తిమీద సాములా ఉంటుందని భయపడుతున్నారు. ఏడాదిన్నర కూటమి పాలనలోనే గతంలో పెందుర్తి తహసీల్దార్‌ను సాధారణ బదిలీపై పంపించగా ఇక్కడ విధుల్లో చేరకుండా మరో ప్రాంతానికి బదిలీ చేసుకున్నారు. తర్వాత కలెక్టర్ కార్యాలయం నుంచి మరో వ్యక్తిని నియమించగా, విధుల్లోకి చేరకుండానే మెడికల్ లీవ్‌పై వెళ్లిపోయారు. రెండు మాసాల క్రితం అల్లూరి సీతారామరాజు జిల్లా ముంచంగిపుట్టు నుంచి తహసీల్దార్‌గా అప్పారావును నియమించారు. నెల రోజులకే కూటమి నేతల ఒత్తిళ్లు భరించలేక లాంగ్‌లీవ్ పెట్టి వెళ్లిపోయారు. మూడు పార్టీల నాయకులు, మాజీ మంత్రులు, సీనియర్ కూటమి నేతల ఒత్తిళ్ల వల్ల అనకాపల్లిలో తహసీల్దార్‌గా పనిచేసేందుకు ఎవరూ ఇష్టపడడం లేదని గుసగుసలు వినిపిస్తున్నాయి. ఇక్కడ పోస్టు ఖాళీగా ఉండటంతో పలువురు కులధ్రువీకరణ పత్రాలు, ఇతర పనుల కోసం తహసీల్దార్ కార్యాలయం చుట్టూ ప్రదక్షిణ చేయాల్సిన పరిస్థితి నెలకొంది.

## లారీ డ్రైవర్లకు ఫేస్ వాష్



హైవేపై డ్రైవర్లకు నీటితో ముఖం కడిగిస్తున్న ట్రాఫిక్ ఎస్ఐ శేఖరం

అనకాపల్లి టౌన్: జాతీయ రహదారిపై రోడ్డు ప్రమాదాలు నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు ట్రాఫిక్ సీఐ వెంకటనారాయణ తెలిపారు. మంగళవారం రాత్రి జాతీయ రహదారిపై లారీలను ఆపి డ్రైవర్లకు ట్రాఫిక్ ఎస్ఐ శేఖరం మంచినీళ్లు ఇచ్చి ముఖం కడిగించారు. పట్టణంలోకి ప్రవేశించే వాహనాలు రోడ్డుపై అనుమతి లేని సమయాల్లో నిలిపితే జరిమానాలు విధిస్తామని సీఐ హెచ్చరించారు.

## యూరియా కొరత లేకుండా ప్రత్యేక చర్యలు



ఎరువుల దుకాణంలో యూరియా నిల్వలు పరిశీలిస్తున్న ఏవో రంగాచారి

అనకాపల్లి: ఖరీఫ్ సీజన్‌లో మండలంలో రైతులకు యూరియా కొరత లేకుండా ప్రత్యేక చర్యలు చేపట్టినట్టు మండల వ్యవసాయశాఖ అధికారి రంగాచారి తెలిపారు. పట్టణంలో పలు ఎరువుల దుకాణాల్లో మంగళవారం వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో తనిఖీలు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఈ ఏడాది మండలంలో 5 వేల ఎకరాల్లో వరి, 200 ఎకరాల్లో చెరకు మాత్రమే వేశారన్నారు. రైతు సేవా కేంద్రం, పీఏసీఎస్, డీలర్ షాప్‌ల ద్వారా రైతులకు యూరియా అందిస్తున్నామన్నారు. 483.71 మెట్రిక్ టన్నులకుగాను ఇంత వరకూ 439 మెట్రిక్ టన్నుల యూరియా పంపిణీ చేశామన్నారు. రేబాక, గొలగాం రైతు సేవా కేంద్రాల్లో యూరియా సరఫరాకు సిద్ధంగా ఉందన్నారు. ప్రైవేట్ ఎరువుల దుకాణ యజమానులు ఎమ్మార్పీకే యూరియా అమ్మకాలు చేయాలన్నారు. ఎక్కువ ధరకు అమ్మకాలు జరిగినట్లు తమ దృష్టికి వచ్చినట్లయితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రైతులకు యూరియా అందజేసే సమయంలో ఆధార్ కార్డు ద్వారా ఆన్‌లైన్లో నమోదు చేయాలని సూచించారు. కార్యక్రమంలో వ్యవసాయశాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఆశ కార్యకర్తల సమస్యలు పరిష్కరించాలి



మాట్లాడుతున్న సీఐటీయూ నాయకుడు దాకారపు శ్రీనివాసరావు

కశింకోట: ఆశ కార్యకర్తల సమస్యలు పరిష్కరించడానికి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని సీఐటీయూ జిల్లా నాయకుడు దాకారపు శ్రీనివాసరావు కోరారు. కశింకోటలో ఏపీ ఆశ వర్కర్ల యూనియన్ (సీఐటీయూ అనుబంధం) సమావేశం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సమస్యల పరిష్కారానికి ఐక్య పోరాటాలు చేయాల్సి ఉందన్నారు. ఆశ కార్యకర్తలకు టీఏ, డీఏలు ఇవ్వాలని, హెల్త్ వెల్‌నెస్ సెంటర్‌లో పని నుంచి మినహాయించాలన్నారు. పీఎఫ్, బీమా సదుపాయాలు కల్పించాలన్నారు. కార్యక్రమంలో యూనియన్ ప్రతినిధులు పార్వతి, లక్ష్మి, శ్రీదేవి, వెంకటలక్ష్మి, ఝాన్సీ, హైమ పాల్గొన్నారు.

## వేలాడుతూ ప్రయాణించాల్సిందే..



కిక్కిరిసిన ప్రయాణికులతో ఆర్టీసీ బస్సు

అనకాపలి టౌన్: స్త్రీ శక్తి పథకం వల్ల ఆర్టీసీ బస్సుల్లో పెరిగిన రద్దీకి తగ్గట్టుగా సర్వీసుల సంఖ్య పెంచాలని అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి డి.డి వరలక్ష్మి కోరారు. గతంలో కంటే ఇటీవల బస్సుల్లో రద్దీ పెరిగిందని, దీనివల్ల ముఖ్యంగా విద్యార్థులు అనేక ఇబ్బందులు పడుతున్నారని వాపోయారు. మారిన పరిస్థితులకు తగ్గట్టుగా బస్సులు ఏర్పాటు చేయకపోవడం వల్ల విద్యార్థులు సకాలంలో కళాశాలలకు చేరుకోలేకపోతున్నారన్నారు. కొంతమంది బస్సుల్లో వేలాడి ప్రయాణం చేయాల్సి వస్తుందన్నారు. దీనివల్ల ప్రమాదాలు జరిగే ఆస్కారం ఉందన్నారు. తక్షణమే అధికారులు స్పందించి బస్సుల్లో పెరిగిన రద్దీకి అనుగుణంగా వాటి సంఖ్యను పెంచాలని కోరారు.

## మద్యం సేవించి స్కూల్ బస్సు నడిపిన డ్రైవర్‌పై కేసు

పరవాడ: మద్యం సేవించి స్కూల్ బస్సు నడుపుతున్న ఓ డ్రైవర్‌పై పరవాడ పోలీసులు కేసు నమోదు చేశారు. స్టీల్ ప్లాంట్ సమీపంలో ఓ ప్రైవేట్ స్కూల్ బస్సును మద్యం సేవించిన డ్రైవర్ నడుపుతున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. ఈ మేరకు సంబంధిత పాఠశాల బస్సును మంగళవారం తనిఖీ చేసి డ్రైవర్‌మానవరపు రాజుమద్యం మత్తులో బస్సును నడుపుతున్నట్లు గుర్తించారు. దీంతో డ్రైవర్‌ను అదుపులోకి తీసుకుని బస్సును సీజ్ చేసినట్లు సీఐ ఆర్.మల్లికార్జునరావు తెలిపారు. మద్యం అలవాటు ఉన్న వ్యక్తులను పాఠశాల బస్సుల డ్రైవర్లుగా నియమిస్తే సంబంధిత యాజమాన్యాలపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. డ్రైవర్ల పూర్వాపరాలను పరిగణలోకి తీసుకుని నియమించుకోవాలని సూచించారు.

## 5న సీనియర్ సిటిజన్స్ జిల్లా సమావేశం

అనకాపల్లి: స్థానిక గవరపాలెం పార్కు సెంటర్‌లోని వి.వి.రమణ రైతుభారతి కార్యాలయంలో సీనియర్ సిటిజన్స్ జిల్లా సమావేశం ఈ నెల 5న ఉదయం 10 గంటలకు నిర్వహిస్తున్నట్లు సిటిజన్స్ వ్యవస్థాపకుడు కాండ్రేగుల అప్పారావు మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సమావేశంలో జిల్లా నూతన కమిటీ ఎన్నిక జరుగుతుందన్నారు. జిల్లాలో సీనియర్ సిటిజన్స్ అందరూ హాజరు కావాలని కోరారు.

## బాధితులకు న్యాయం చేయాలి

మునగపాక: పూడిమడక రోడ్డు విస్తరణ బాధితులకు న్యాయం చేయాలని తహసీల్దార్ పి.సత్యనారాయణకు మంగళవారం నిర్వాసితులు వినతిపత్రం అందజేశారు. రహదారి విస్తరణ అభ్యంతరాలపై ప్రకటన చేసిన నేపథ్యంలో నిర్వాసితులు బ్రహ్మజీ, శ్రీనివాసరావు మాట్లాడుతూ 2013 భూసేకరణ చట్ట ప్రకారం పరిహారం అందించాలన్నారు. నష్టపరిహారాన్ని టీడీఆర్ బాండ్ల రూపంలో కాకుండా నేరుగా అకౌంట్‌లో జమ చేసేలా చూడాలని కోరారు.